# తీర్పు

## అల్లక కేశవరావు

అక్కడ చేరిన పదిమందీ సాయం పట్టి కొంతదూరం ముందుకు సాగనంపితే వాళ్ళ ముఖాల కింద దుమ్ము కొట్టి దూసుకుపోయింది పంచాయతీ సమితి వారి జీపు

హఠాత్తుగా నాకు 'తాతగారు' గుర్తొచ్చారు.

తాతగారంటే-స్వయానా నా తల్లి తండ్రో తండ్రి తండ్రో కాదు హయ్యరుగ్రేడు టీచరుగా వృత్తిని ప్రారంభించి స్వయంకృషితో బి. ఏ. పాసై, నలభై యేళ్ళు పైబడ్డ తరువాత నాలాంటి కుర్రాళ్ళతో కలిసి బి. ఇడి. ట్రయినింగయిన నరసింహులు మాష్టరు గారు

ఎప్పుడూ ధరించే ముతక ఖద్దరు పంచా, లాల్చీ, ఫ్రేం ఒకవేపు విరిగిపోగా తాడుకట్టి కాలక్షేపం చేస్తున్న కళ్ళద్దాలు, సగానికి పైగా నెరిసిపోయిన జుట్టూ- ఆ ఆకారం చూసి కాలేజీ తెరిచిన కొత్తలోనే నరసింహులుగారికి గ్రూంలో 'తాతగారు' అనే బిరుదు ప్రదానం జరిగింది.

ఏది ఏమైనా ఆయన మాటల్లో చేతల్లో ప్రస్ఫుటంగా కనిపించే అనుభవజ్ఞానం వల్ల ఆయనపట్ల నాకు చాలా గౌరవభావ ముండేది. అందుకనే మా ట్రయినింగు పూర్తయి ఆఖరి పరీక్ష రాసిన తరువాత అధ్యాపకులందరిదగ్గరా సెలవు తీసుకుని, రౌండుమహాలు మెట్ల దగ్గిర నిలబడి నరసింహులుగారికోసం వెదికాను. అప్పటికాయన లైబ్రరీ దాటి ముందుకు వెళ్ళిపోతున్నారు. పరుగెత్తి వెళ్ళి కలిసాను

"ఏంవిటి మనవడూ! నా వెంట పడ్డావ్?"-అన్నారు ఆప్యాయంగా నా భుజంమీద చెయ్యివేసి.

"మరేం లేదు తాతగారూ! ఇన్నాళ్లూ కలిసిమెలిసి ఒకరికొకరుగా ఉన్నాం. ఈనాటితో విడిపోతున్నాం. మళ్ళా ఎన్నాళ్ళకు కలుసుకుంటామో యేమో!" అన్నాను.

"అవునయ్యా! కొన్నాళ్ళపాటు కొంచెం కష్టమనిపిస్తుంది. కాలక్రమాన అన్నిటినీ మరిచిపోతాం, యాంత్రిక జీవితాల్లోకి ప్రవేశించిన తరువాత-" చాలా సాధారణంగా అన్నారు నరసింహులుగారు. నా కా మాటలు రుచించ లేదు.

గేటుదగ్గరున్న ఆంజనేయస్వామి

గుడిదగ్గరకొచ్చాం. నరసింహులుగారు చెప్పులు దిగి రెండుచేతులూ ఎత్తి భక్తి పూర్వకంగా నమస్కరించారు. ఇది ఆయనకు రెండుపూటలా అలవాటు. నా కలాంటి అలవాట్లేం లేవు. అలాగని నేను నాస్తికుణ్ణి మాత్రం కాదు. ట్రయినింగయిన ఆ సంవత్సరకాలంలో ఆ చుట్టుపట్ల ఎవరూ లేని సమయం చూసి నాలుగైదుసార్లు రహస్యంగా నేనూ నమస్కరించి ఉంటాను. మెయిన్‌గేటు దాటి రోడ్డుమీదకొచ్చాం. ఇంక యిద్దరం విడిపోవాలి. ఆయన దాసన్నపేటకీ, నేను గంటస్తంభం రోడ్డుకీ.

నమస్కరించి నేనన్నాను. "తాతగారూ! సెలవు. ఇక విడిపోతున్నాం. నన్ను మరిచిపోకండి. నాదో చిన్న కోరిక, ఉపాధ్యాయుడుగా జీవితం ప్రారంభించనున్న నాకు అనుభవమున్న ఉపాధ్యాయుడుగా ఓ రెండు మంచి మాటలు చెప్పండి."


నరసింహులుగారు నావేపు ప్రేమగా చూశారు. అంతలోనే ఆయన ముఖం గంభీరంగా మారిపోయింది. నిలుచుని వెనుకకు తిరిగారు. కాలేజీ బిల్డింగులన్నీ యిప్పుడు మాకెదురుగా ఉన్నాయి. ఒక్క నిముష మాగి అన్నారు- "చూడు నాయనా! ఇప్పుడు కాలేజీలుగా మారిన ఈ భవనాలన్నీ ఒకనాటి మహారాజా వారి మందిరాలు. చుట్టూ బ్రహ్మాండమైన ప్రహరీ ఉంది. అదిప్పుడు కూలిపోతూంది. గోడచుట్టూ లోతైన కందకముంది. అదిప్పుడు కప్పబడిపోతూంది. ఈ సంత్సరం నువ్విక్కడ నేర్చుకున్నదంతా ఈ కప్పబడిపోతూన్న కందకంలో పాతిపెట్టి ఇంటికి వెళ్ళు. సుఖపడతావ్"-

తుళ్ళిపడ్డా నా మాటలు విని. ఇంతమంది విద్యాధికులైన అధ్యాపకులు సంవత్సరంపాటు శ్రమపడి మాకు చేసిన మహోపదేశాన్ని ఇంత నిష్ప్రయోజనంగా ఎలా అంచనా కట్టగలిగాడీయన?-

ఊహించుకోలేకపోయాను. నా మనోభావాలను చదివినట్టుగా ఆయనే మళ్ళా అన్నారు. "నన్నపార్థం చేసుకోకు మనవడూ! ఇలా అన్నానని, యిక్కడ మనం నేర్చుకున్నది నిరర్థకమని ఎప్పుడూ నా అభిప్రాయం కాదు. దానిని ఆచరణలో పెడుతూ తన పని తాను చేసుకోడానికి అవకాశం లేని దౌర్భాగ్యపు స్థితి ఈనాటి ఉపాధ్యాయులకు పట్టిందనేదే నా ఆవేదన" అని.

ఆ మాటల కర్థం నా కప్పుడు బోధపడలేదు. నాకామాటలు తృప్తినీ కలిగించలేదు. ఇంకా చెప్పాలంటే అంతవరకూ ఆయనపట్ల నాకు గల గౌరవం కొంత పట్టు సడలిపోయింది.

ఇల్లు చేరుకున్నాను. పరీక్ష పాసయ్యానని తెలిసిన నాటినుండీ ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాను. మా చుట్టుపట్ల సమితులకీ పరిషత్తుకీ అప్లికేషన్లు పంపాను. జిల్లా పరిషత్తునుండి కనీసం ఇంటర్వ్యూకూడా రా లే దు. ఒక సమితివారు పిలిచారు. వెళ్ళాను. నాకుద్యోగం దొరికింది. పట్నానికి మూడుమైళ్ళదూరమున్న రామాపురంలో ఈమధ్యనే ఏర్పాటయిన అప్పర్ ప్రయి



మరీ స్కూల్లో హెడ్ మాస్టరుగా వేశారు నన్ను ప్రత్యేకించి బి.ఇడి. పోస్టు క్రియేట్ చేస్తూ.

ఇదంతా నా అదృష్ట మనుకున్నాను. కాని దీని కంతటికీ మూలకారకుడు రామాపురం సర్పంచ్‌గారని అపాయింట్‌మెంట్ ఆర్డరు చేతికిస్తూ సమితి గుమాస్తా చెప్పాడు.

రామాపురం సర్పంచ్ అంటే సామాన్యుడు కాడు. చెప్పుకోవలసిన చదువు లేకున్నా చెప్పలేనంత 'తెలివి' కలవాడు. అందుకే ఆయన తనమీద యే రాజకీయపార్టీ ముద్రా వేసుకోలేదు. ఇండిపెండెంటు నంటాడు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, ఎటు ఊగితే అటు ఊగుతూ నీడలా ఈయ న్ననుసరించే మరో పదిమంది ప్రెసిడెంట్లు న్నారు ఆ సమితిలో. అందుకే ఎవ ర్ననుకుంటే ఆయన్ని సమితి అధ్యక్ష స్థానంలో నిలబెట్టగల సత్తా ఆయన కుంది—స్వయానా తానా స్థానంలో కూచునే అవకాశం లేకపోయినా.

సదరు మహావ్యక్తిని గురించి పరిచయం కలగజేసుకోవడం నా కర్తవ్యం భావించాను. ఇకమీద అదే గ్రామంలో నేనూ ఉండాలికనుకా, నా నా ఉద్యోగ ధర్మనిర్వహణలో ఆయన తోడ్పాటు ఇంతో అంతో అవసర

ముంటుంది కనుకా.

వెళ్ళి నమస్కరించగానే గడగడా ఆయనే మాట్లాడాడు. "వచ్చేశావటోయ్. మంచిపని చేశావ్. అసలు మనసమితిలో బి.ఇడి. పోస్టులేదయ్యా. ఈ సంవత్సరం మా కుర్రాడొకడు పదో తరగతి కొచ్చాడు, వెధవది వాడీ సంవత్సరం పరీక్షలు రాస్తేకాని పాస్ కాడు. వాడికి ట్యూషన్ చెప్పగలవాడెవడూ ఈ సమితిలో లేడు. బి ఇడి.వి కదా! నువ్వయితే పనికొస్తావని కావాలని యిక్కడ వేయించుకున్నాను. ఈ సాయంకాలంనుంచే ట్యూషను ప్రారంభించు. సరే నువ్వెళ్లు. ఏమన్నా పనులుంటే చూసుకో"-అనేసి తన పనిలో తాను లీనమయ్యాడాయన.

నా తల దిమ్మెక్కిపోయింది. ఆయన నన్ను సంబోధించిన పద్ధతీ, మాట్లాడే విధానమూ నాకేమాత్రం నచ్చలేదు. నేనొచ్చింది నా బడిలో పిల్లలకు చదువు చెప్పడానికి కాదు! ప్రెసిడెంటుగారబ్బాయికి ట్యూషను చెప్పడానికి— అందుకనే ఆయన నన్ను వేయించుకున్నాడిక్కడ—ఎంత ఘోరం! నాకు చాలా అవమానమనిపించింది. కాని ఏం చెయ్యగలను? ఏమన్నా చెయ్యగలనా అని??—

బడిగా ఉపయోగపడుతున్న గుడిసెలో అడుగుపెట్టిన తరువాత నాలో మిగిలిన ఉత్సాహం పూర్తిగా చచ్చిపోయింది. విరిగిన కుర్చీలో అతి జాగ్రత్తగా కూచుని పిల్లలకేదో పాఠం చెప్పుకుంటున్నాడొక టీచరు. మరో వేపొక కుర్చీ ఖాళీగా ఉంది. కొంతమంది పిల్లలు బడిచుట్టూ పరుగులు తీస్తూ యేవో ఆటలాడుకుంటున్నారు. నన్ను చూడగానే చెబుతున్న పాఠం ఆపి సాదరంగా ఆహ్వానించాడా టీచరు. నేను కూచుని కాస్త స్థిమితపడిన తరువాత ఆయన చెప్పిన పాఠశాల చరిత్ర స్థూలంగా యిది.

నిన్న మొన్నటి వరకూ అక్కడా యిక్కడా వరండాలమీద జరుపబడుతుండేది బడి. ఈ పాకలో ప్రెసిడెంటుగారి పశువులు కాపురముండేవి. బడిని అప్పర్ ప్రయిమరీ చెయ్యాలంటే కనీసం పిల్లలు కూచోడానికింత స్థిరమైన ఆధరువుండాలి కనుక ఇంతకంటే మంచిది మరొక పాక ప్రెసిడెంటుగారు కట్టించి, అందులోకి పశువుల్ని పంపి ఇందులోకి పిల్లల్ని పంపారు. ఇంతవరకూ యిద్దరే ఉపాధ్యాయులు పని చేస్తున్నారీ బడిలో ఒకరు—బడిలో ఇప్పుడున్నాయన, హయ్యరుగ్రేడు టీచరు. రెండో ఆయన సెకండరీగ్రేడు. పేరు పాపారావు. ఇంతవరకూ ఆ బడికి ప్రధానోపాధ్యాయుడు-నేటి నుండి ఫస్టు అసిస్టెంటు. ఆయనకి ఉద్యోగం కేవలం అలంకారప్రాయం. నిజానికాయన ఆ ఊళ్ళోనే ఉన్న ప్రెసిడెంటుగారి రైసు మిల్లు మానేజరు. వారానికో పది రోజులకో ఓ సారి బడిలోనికొచ్చి, అవసరమైన చోట్ల సంతకాలు మాత్రం చేసి పోతుంటాడు. ఈ విషయం సమితిలోగల అధికార అనధికార ప్రముఖులందరికీ తెలుసును. కానీ అందరూ ఎవరికి వారే తమకు తెలియనట్టుగా కాలం వెళ్ళబుచ్చుతున్నారు.




కాలేజీలో నేర్పిన ప్రధానోపాధ్యాయుని లక్షణాలూ విధులూ ఓసారి గుర్తు చేసుకున్నాను. సాయంకాలం ఇద్దరు టీచర్లనీ పిలిపించాను. బడి, విద్య, ఉపాధ్యాయుడు-మొదలైన విషయాల మీద చిన్న ఉపన్యాసంలాంటిదిచ్చాను. సరిగా ఎవరి ధర్మం వారు నిర్వర్తించుకోకపోతే ఒప్పుకోనన్నాను అందరం కలిసికట్టుగా పనిచేసి బడిని ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దుదామని నచ్చచెప్పాను.

ఏమనుకున్నాడో ఏమో, పాపారావు మర్నాటినుండీ బడికి సక్రమంగా రావడం ప్రారంభించాడు. నాకు చాలా సంతోషమైంది. పదిరోజులయ్యేసరికి బడికి కొత్తగా కళ వచ్చినట్టయింది. ఎవరిపనులు వాళ్ళం చేసుకుంటున్నాం. పిల్లల్లో కూడా నూతనోత్సాహం కనిపించింది. కాని, క్రమంగా....లేట్లు.... పర్మిషన్లు ...ప్రారంభించాడు పాపారావు. ఒకటిరెండుసార్లు సెలవు పంపకుండా గైరుహాజరయ్యాడు కూడా. మళ్లా బండి పట్టాలు తప్పుతోందని గ్రహించి ఒకసారి హెచ్చరించాను. ఏమనకుండా తన సీట్లోకి వెళ్ళిపోయాడు పాపారావు.

ఆ సాయంత్రం ప్రెసిడెంటుగారు రమ్మంటున్నారని కబురు వచ్చింది. వెళ్లాను. ఆయన తన ధోరణిలోనే మాట్లాడాడు. "ఏమిటోయ్! ఏవో ధర్మోపదేశాలు మొదలెట్టావట. తిన్నగా ఉద్యోగం చేసుకోవాలని లేదేవిటి? ఇంతవరకూ మావాడికి పాఠాలూ ప్రారంభించలేదట నేన్నీకు చెప్పిందేవిటి? నువ్వు చేస్తున్నదేవిటి?-పది

రోజులుగా నేనూళ్ళో లేను. పాపా రావుని మిల్లు కెళ్ళనిచ్చావు కాదట. నా కెంత ట్రబులనీ! ఆఁ! ....సరేలే. వెళ్లు. ఈరోజు నుంచయినా మావాడికి పాఠా లారంభించు"- అని ఒక్కక్షణం ఆగి "పాపారావు రోజూ బడికి రావాలంటే కుదరదోయ్. చిన్నమేష్టరున్నాడుకదా! ఇద్దరి పనీ వాడే చూసుకుంటాడులే"- నచ్చచెప్పాడు. ఈ పద్ధతి కేమనాలో తెలియక వెళ్లిపోయాను. మర్నాటినుండీ పాపారావు బడికి రాలేదు. నేను ప్రెసిడెంటుగా రబ్బాయికి పాఠాలూ ప్రారంభించలేదు. కబురు పంపినా పాపారావు బడికిరాలేదు, సరికదా సెలవూ పంపించ లేదు. రెండురోజు లాగినా ఫలితం శూన్యమయ్యేసరికి మూడోనాడు విష యాన్ని బి. డి. వో. గారికి రిపోర్టు ద్వారా తెలియచేశాను.

వారం రోజుల తరువాత పాపా రావును వెంట తీసుకుని ప్రసిడెంటు స్వయంగా బడి కొచ్చాడు వస్తూనే అడిగాడు "ఏమయ్యా! మా వాడి కెన్ని పాఠాలయ్యాయ్?" అని అస లే పార మూ కాలేదని ఆయనకు తెలుసు. "ఏదీ! మీ వాడొకసారి కూడా నా దగ్గరకు రాక పోతే పా ఠా లె లా ఔతాయండీ?"— సౌమ్యంగానే అన్నాన్నేను.

"ఓహో! నీ దగ్గరకు మా వాడు రావాలన్న మాట. నువ్వు మా యింటికి రాలేవు-"అని ప్రతి అక్షరమూ నొక్కి నొక్కి పలికి "మరి పాపారావు సంగతే మాలోచించావ్?"- ఆయినే అడిగాడు. "ఆలోచించడానికేముందండీ? ఏ సెలవూ లేకుండా ఆయన బడికి గైరు హాజరయ్యారు. అదె బి. డి. వో. గారికి రిపోర్టు చేశాను. ఇప్పటికైనా మించిందేం లేదు. సెలవు పెట్టినట్టతే సిఫారసు చేస్తాను-" అన్నాను.

తారా జువ్వలా లేచాడు ప్రసిడెంటు. "నీ బోడి సిఫార్సెవడిక్కావాలోయ్? కళ్లు నెత్తికెక్కి నాతో తెచ్చుకున్నావ్. రిపోర్టు చేశాడట రిపోర్టు. ఆ బి. డి. వో. వచ్చి యిక నీకు రక్షిస్తాడులే. రావోయ్ పాపారావ్-" అనేసి వచ్చి నంత హడావుడిగా వెళ్ళి పోయాడు. వెనకాలే పాపారావు కూడా గర్వంగా తలెగరేస్తూ.

రెండో అసిస్టెంటు వచ్చి నా కేదో చెప్పబోయాడు. కాని నేనేం చెప్ప నియ్యలేదు. జ రి గి న విషయమంతా రాసి మరో రిపార్టు బి. డి. వో. గారికి పంపించాను ఎందుకయినా మంచిదని పదిహేను రోజుల తరువాత సమితి జీపు వచ్చి మా బడి ముందాగింది. మొదట సమితి అధ్యక్షుడు, తరువాత మా గ్రామాధ్యక్షుడు, ఆ వెనుక బి. డి. వో.గారు వరుసగా దిగారు. జీపును చూసి పది మంది గ్రామస్థులు పోగ య్యారు.

జరిగిన కథంతా నా ద్వారా మరో సారి విని, సమితి ప్రసిడెంటు గారి న్నారు "నువ్వు చాలా కథలల్లగలయ్యా! నీ సొంత పనేదో చెప్తే వినలేదని కక్ష కట్టి పాపారావు బడి కొచ్చినా సంత కం చెయ్యనీయకుండా చేస్తున్నావ్. సర్దటానికి సర్పంచ్ గారొస్తే ఆయననీ ధిక్కరించావ్. పైగా లేని పోనివి కల్పిస్తూ నువ్వే వాళ్ళమీద రిపోర్టులు

పంపిస్తున్నావ్. బాగుంది-" అని అక్కడ చేరిన వారి నుద్దేశించి అడిగారు "ఏమయ్యా! ఈ కొత్తమాస్టరు బాగా చదువు చెప్తున్నాడా?-"

ఒక్కక్షణం నిశ్శబ్దం. తరువాత మా గ్రామాధ్యక్షుడందుకున్నాడు.

"చెప్పండ్రా. అయ్యగారడుగుతోంది మనక్కావలసింది మన పిల్లల చదువు. ఇన్నాళ్లూ నా దగ్గరకొచ్చి ఏడ్చినవాళ్ళు అయ్యగారే స్వయంగా వచ్చి అడుగుతుంటే మాట్లాడరేంరా?"—

"బళ్ళో కూచుని ఆయనెప్పుడూ సినిమా పుస్తకాలు సదువుకుంటారండి"

"సదువు సంగతడిగితే కస్సున లేస్తాడండి"—

"ఏం కష్టపడ్డా పాపారావు మాష్టారే నండి"—

"ఈయనొచ్చి తరవాత ఒచ్చిన సదువు కూడా మరిసిపోయారండి పిల్లలు"—గుంపులోంచి సమాధానాలు

ఆ చెప్పిన వాళ్ళలో ఏ ఒక్కడికీ బళ్ళో చదువుతున్న పిల్లలు లేరు వాళ్ళంతా సర్పంచ్‌గారి పాలేర్లు మిగిలినవారు నీళ్ళు నములుతున్నారు. ఈ విషయం చెప్పవలసిన అవసరం నా కక్కడ కనిపించలేదు.

మళ్ళా సమితి ప్రెసిడెంటుగారారంభించారు. "నువ్వు నాన్ పానల్‌వాడివనీ, నీ ఉద్యోగం పూర్తిగా టెంపరరీ అని మరిచిపోయినట్టున్నావ్. స్టాఫ్‌తో కలిసి మెలసి ఉండలేనివాడివి నువ్వేం పని చెయ్యగలవయ్యా? యదార్థం పాపారావు రిపోర్టు నిజంకాదని అనగలవేమోగాని, ప్రత్యక్షంగా కనిపిస్తున్న ఈ ప్రజల తీర్పును కాదనగలవా? నీలాంటివాడు నా సమితిలో పని చెయ్యడం నాకు పరువు తక్కువ. నిన్ను ఊష్టు చేస్తున్నాను."—

అందరూ జీపెక్కారు.

ఆ మర్నాడు మా సర్పంచ్‌గారే స్వయంగా నా ఊష్టింగార్డరు తెచ్చియిచ్చారు. రిలీవయి నా సామానులు సర్దుకుంటూ ఉండగా నాలో ఒక ప్రశ్న తలెత్తింది.

విద్య, బడి, ఉపాధ్యాయుడు, కర్తవ్యాలు ఇవన్నీ కాబోయే ఉపాధ్యాయులకు శిక్షణాలయాల్లో నేర్పుతారు. కాని ఆ ఉపాధ్యాయుల మీద, విద్య మీద అజమాయిషీ చెలాయిస్తున్న ఈ పెద్దలకూ,-పిల్లల భవిష్యత్తును తామే భస్మం చేసుకుంటున్నామని తెలుసుకోలేని ఈ ప్రజలకూ,-ఇవన్నీ ఎవరు, ఎక్కడ నేర్పుతారు? వారి విధులు వారి కర్తవ్యాలు పెద్దలకూ, ప్రజలకూ తెలియవా? తెలిసినా పాటించనవసరం లేదా? లేక అవకాశమే లేదా?

స్వగ్రామం చేరుకున్నాను. ఇక యేం చెయ్యాలి? ఎవరికి అప్లయ్ చెయ్యాలి?. ఏ సమితికి?....ఏ జిల్లా పరిషత్తుకి?.. ఎవరికి? ... ఎవరికి? ఆలోచిస్తున్నాను.

హఠాత్తుగా....ఇన్నాళ్ళ తరువాత.. తాతగారు జ్ఞాపకమొచ్చారు. చివరిసారిగా ఆయన చెప్పిన మాటలు కూడా జ్ఞాపకమొచ్చాయి.... ❊